సాక్షి సూర్యాపేట

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



ఒక శకం ముగిసింది

దామోదర్‌రెడ్డి మృతితో ఉమ్మడి జిల్లాలో ఒక రాజకీయ శకం ముగిసిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. -10లో



ప్రజాస్వామ్యంపైనే దాడి

జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేశారు. -10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	589.80 అడుగులు
ఇన్‌ఫ్లో	:	68,090 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	68,090 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,008 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,684 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,200 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

బాణసంచా విక్రయానికి అనుమతులు తప్పనిసరి

సూర్యాపేటటౌన్ : దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా విక్రయానికి అధికారుల నుంచి అనుమతులు తీసుకోవడం తప్పనిసరి అని జిల్లా ఎస్పీ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే క్రాకర్స్ విక్రయాలు జరగాలని, అనుమతి లేకుండా ఇతర ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం నిషిద్ధమని పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర సంఘటనలను నివారించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాణసంచా తయారీదారులు, సరఫరాదారులు, విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరపవద్దని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలను ఏర్పాటుచేస్తే వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్టు ప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డబ్బుల కోసం వేధిస్తున్న కుమారుడిపై ఫిర్యాదు

నాగారం : తనకు వచ్చే పెన్షన్ డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్న కుమారుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుండెటి రాములు తెలిపారు. సోమవారం నాగారంలో విలేకరులతో మాట్లాడారు. తనకు ఇద్దరు కుమారులని, తన ఆస్తిని వారికి సమానంగా పంచి ఇచ్చానన్నారు. స్వగ్రామంలో తన చిన్న కుమారుడి వాటాకు వచ్చిన ఇంటిలో తాను, తన భార్య నివాసం ఉంటున్నామని తెలిపారు. పెద్ద కుమారుడు గుండెటి శ్యాంసుందర్ తన పిల్లల చదువులకు భారంగా ఉందని తనకు ప్రతినెలా రూ.5వేల చొప్పున ఇవ్వాలని అడిగాడని దానికి అంగీకరించి 14 ఏళ్లుగా ఇస్తూ వచ్చానన్నారు. అయితే పింఛన్‌లో సగం డబ్బులు ఇవ్వాలని లేకపోతే తనను, తన భార్యను, తన చిన్న కుమారుడిని చంపుతానని పెద్దకుమారుడు బెదిరిస్తున్నాడని ఆరోపించాడు. పెన్షన్ డబ్బుల కోసం వేధిస్తున్న తన కుమారుడు గుండెటి శ్యాంసుదర్‌పై చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని కోరారు.

బాలాజీపై ఒక్కరోజే 112 ఫిర్యాదులు

- ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసిన గుడిపల్లి పోలీసులు

పెద్దఅడిశర్లపల్లి : అధిక వడ్డీ ఆశ చూపి అమాయక ప్రజలను మోసం చేసిన వడ్డీ వ్యాపారి బాలాజీనాయక్‌పై సోమవారం ఒక్కరోజే 112 ఫిర్యాదులు అందాయి. సోమవారం నల్లగొండ జిల్లా గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు బాధితులు అప్పు పత్రాలు, ఖాళీ చెక్కులతో తరలివచ్చారు. దీంతో గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 185 మంది బాధితులు బాలాజీపై ఫిర్యాదు చేసినట్లు గుడిపల్లి పోలీసులు తెలిపారు. ఈ క్యాంపును ఏఎస్పీ మౌనిక పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి కోర్టు ద్వారా న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు.

శివాలయంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలోని స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో నిత్యారాధనలు కొనసాగాయి. వేవకుజామున సుప్రభాత సేవ, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, అర్చన చేశారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన, నిత్యకల్యాణం పూజలు నిర్వహించారు.

842 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చాం : ఎస్పీ

సూర్యాపేటటౌన్ : ఈ ఏడాది వివిధ సందర్భాలలో పోగొట్టుకున్న 842 ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు జిల్లా ఎస్పీ నరసింహ వెల్లడించారు. జిల్లాలో పోగొట్టుకున్న 102 ఫోన్‌లను రికవరీ చేసి సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న సైబర్ వారియర్స్ నిరంతర శ్రమ ఫలితంగానే ఈ 102 మొబైల్స్ బాధితులకు అందించగలిగామన్నారు. సెల్ ఫోన్ దొంగతనాల నుంచి విముక్తి కల్పించడానికై డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, బాధితులు పాల్గొన్నారు.



ఫోన్‌లు అందుకున్న బాధితులతో ఎస్పీ నరసింహ, పోలీస్ అధికారులు, సిబ్బంది

వస్తున్నారు.. ట్రాఫిక్ వలంటీర్లు

- రద్దీ ప్రాంతాల్లో నియమించేలా ప్రణాళిక
- ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపారుల భాగస్వామ్యంతో సేవలు
- సైబరాబాద్ తరహాలో సూర్యాపేట పట్టణంలో తొలిసారి అమలుకు కసరత్తు
- విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా..
- ఎస్పీ నరసింహ ప్రత్యేక చొరవ



సూర్యాపేటటౌన్ : పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక వలంటీర్ వ్యవస్థను తీసుకురానున్నారు. సైబరాబాద్ తరహాలోనే జిల్లాలోనూ ముఖ్యమైన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులకు తోడుగా వలంటీర్ల సేవలు వినియోగించేలా ఎస్పీ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రైవేట్ ఆఫీస్‌లు, బడా వ్యాపారవేత్తల భాగస్వామ్యంతో సొసైటీ ఏర్పాటు చేసి తద్వారా వలంటీర్లను నియమించి వారికి వేతనాలు అందజేస్తారు. మొదట సూర్యాపేట జిల్లా కేంద్రంలో అమలు చేయనున్నారు.

ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు

సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు కోదాడలో ఎక్కువగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వారి సంఖ్య భారీగా పెరిగింది. విద్యా, వైద్యానికి సూర్యాపేట ప్రసిద్ధి కావడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి సైతం ప్రజలు జిల్లా కేంద్రానికి వస్తుంటారు. ఇటీవల వ్యాపారపరంగా కూడా ఎంతో అభివృద్ధి చెందింది. దీంతో సూర్యాపేట పట్టణానికి రోజుకూ 2లక్షలకు పైగా జనం వస్తుండడంతో ట్రాఫిక్ పెరిగింది. మరోపక్క రోడ్లు కూడా ఇరుకుగా ఉండడంతో రోడ్ల పైనే వాహనాలను నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్య రెట్టింపు అయింది. ఈ క్రమంలో రోడ్డు పై వాహనాలు నడపాలంటే జనాలు జంకుతున్న పరిస్థితి నెలకొంది. అయితే ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ట్రాఫిక్ పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం దక్కడం లేదు.

మొదట సూర్యాపేటలో..

మొదట సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు జిల్లా ఎస్పీ నరసింహ నడుం బిగించారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలలోని వ్యాపారస్తులు, ప్రైవేట్ ఆఫీసుల భాగస్వామ్యంతో ఓ సొసైటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ సొసైటీ ఆధ్వర్యంలోనే ట్రాఫిక్ వలంటీర్లను నియమించుకొని వారికి నెలకు కొంత జీతం చెల్లించేలా వ్యూహరచన చేస్తున్నారు. ప్రైవేట్ ఆఫీసుల వారు, వ్యాపారస్తులు, ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారికి తోచిన సహాయం అందిస్తే దానిని వలంటీర్లకు జీతాల రూపంలో చెల్లించనున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ సిబ్బంది కొరత ఎక్కువగా ఉండడంతో ఈ నూతన విధానం ద్వారా ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలనే ఆలోచన చేస్తున్నారు. త్వరలో వ్యాపారస్తులతో సమావేశాలు నిర్వహించి మొదట జిల్లా కేంద్రంలో అమలు చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఇది విజయవంతం అయితే జిల్లాలోని కోదాడ తదితర ప్రాంతాలలో అమలు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సైబరాబాద్ లో ఈ తరహా వ్యవస్థ కొనసాగుతుండగా ఇప్పుడు సూర్యాపేట జిల్లాలో ఏర్పాటు చేస్తుండడం విశేషం.

త్వరలో కార్యాచరణ

ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతున్న క్రమంలో వ్యాపారస్తులను భాగస్వామ్యం చేసి ట్రాఫిక్ వలంటీర్లను నియమించేలా ప్లాన్ చేస్తున్నాం. దీంతో రద్దీ ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులు, వలంటీర్ల సహాయంతో ట్రాఫిక్ సమస్యను తగ్గించవచ్చు. త్వరలోనే కార్యాచరణ ప్రారంభిస్తున్నాం.

– కె.నరసింహ, ఎస్పీ, సూర్యాపేట

అర్జీలు వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ సీతారామారావు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

భానుపురి (సూర్యాపేట) : ప్రజావాణిలో వచ్చే అర్జీలను జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు ఆదేశించారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. జిల్లా అధికారులు పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వి.వి.అప్పారావు, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, డీసీఓ పద్మ, డీఈఓ అశోక్, డీఏఓ శ్రీధర్ రెడ్డి, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, శ్రీనివాస్, నరసింహారావు , పరిపాలన అధికారి సుదర్శన్‌రెడ్డి, సూపరింటెండెంట్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

55 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం

వానా కాలం 2025–26 సీజన్‌కు సంబంధించి సూర్యాపేట జిల్లాలో 55 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ కె.సీతారామారావు తెలిపారు. వానాకాలం ధాన్యం సేకరణపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రటరీ స్టీఫెన్ రవీంద్ర .. జిల్లా అదనపు కలెక్టర్, సివిల్ సప్లయ్, వ్యవసాయ, మార్కెటింగ్, కో–ఆపరేటివ్, ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సూర్యాపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. ప్రస్తుతానికి జిల్లాలో 298 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆమోదం తెలిపామన్నారు. 4లక్షల 30 వేల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి సెంటర్‌లో సెంటర్ పేరు, సెంటర్ ఇన్‌చార్జి పేరు, ఇతర సిబ్బంది పేర్లు ఉండాలన్నారు. ప్రతి మండలంలో మండల్ స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా అధికారులను నియమించాలని, ఎంపీడీఓలకు ఐకేపీ సెంటర్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని, ప్రతి సెంటర్‌లో ఎక్విప్మెంట్ లెక్కలు కచ్చితంగా ఉండాలన్నారు. అవసరమైన సామగ్రికి ఇండెంట్ పెట్టాలని, ధాన్యం కొనుగోలులో అక్రమాలు, అలసత్వం ప్రదర్శిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ మోహన్ బాబు, సివిల్ సప్లయ్ డీఎం రాము, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి వి.వి. అప్పారావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ, డీసీఓ పద్మ, డీఏఓ శ్రీధర్ రెడ్డి, ఏపీడీ సురేష్, నగేష్, ఏడీఎం బెనర్జీ, ఏఎస్‌ఓ శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృ తాభిషేకం చేసి స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. అనంతరం నిత్యకల్యాణంలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఋత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనం పై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశం చేసిన తర్వాత నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయా చార్యులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అందరి ఆమోదంతోనే డీసీసీ అధ్యక్షుడి ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు సారత్ రాత్



ఆర్డీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐసీసీ పరిశీలకుడు సారత్‌రాత్

- ఏఐసీసీ పరిశీలకుడు సారత్ రాత్

భానుపురి (సూర్యాపేట) : పార్టీ శ్రేణుల అభీష్టం మేరకు కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడి నియామకం ఉంటుందని ఏఐసీసీ పరిశీలకుడు సారత్ రాత్ తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేస్తామన్నారు. మొదటగా గుజరాత్‌లో పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయం సేకరించి డీసీసీ అధ్యక్షుల ఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు. ఆ తర్వాత మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, జార్ఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ, ప్రస్తుతం తెలంగాణలోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం జిల్లావ్యాప్తంగా మండలాలు, గ్రామాలలో తాను పర్యటిస్తానని, అందరి అభిప్రాయాలు తెలుసుకుని డీసీసీ అధ్యక్షుని ఎంపికలో యువతకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల నుంచి ఆరుగురు పేర్లు ఏఐసీసీకి పంపిస్తామని, వారిలో ఒకరిని డీసీసీ అధ్యక్షుడిగా ఏఐసీసీ ఎంపిక చేస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలతో పాటు పౌర సమాజం, ఎన్జీఓలను కలుస్తానని, ఎవరైనా తమ అభిప్రాయం తెలియజేయవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయం ప్రకారం ఉత్తమమైన వ్యక్తులను తాను సెలెక్ట్ చేయనున్నట్లు తెలిపారు. లాభాపేక్ష లేకుండా పార్టీకి పనిచేసే వారిని ఎంపిక చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున పార్టీ కూడా పటిష్టం అయ్యేలా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, పీసీసీ జనరల్ సెక్రటరీ చకిలం రాజేశ్వరరావు, ఓబీసీ నాయకులు తండు శ్రీనివాస్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మార్కెట్ చైర్మన్లు అరుణ్ కుమార్, నరేష్ సుమతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అనురాధ, పట్టణ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, మండల పార్టీ అధ్యక్షులు వీరన్న నాయక్, తూముల సురేష్ రావు, కోతి గోపాల్ రెడ్డి, కందాల వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేములపల్లి వాసుదేవ రావు, దండి రమేష్, జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షుడు కక్కిరేని శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అభినయ్, కోదాడ,హుజూర్‌నగర్ మండల, బ్లాక్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీకి ప్రత్యేక బృందాలు

- సబ్జెక్టు నిపుణులతో 11 టీములు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- రెండు, మూడు రోజుల్లో సభ్యుల ఎంపిక
- త్వరలో 850 బడుల్లో తనిఖీలు



చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీ చేయాలని నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా సబ్జెక్టు నిపుణులతో 11 టీములను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. రెండు మూడు రోజుల్లో టీముల్లో సభ్యులను నియమిస్తారు. త్వరలో ఈ బృందాలు తనిఖీలు చేపడతాయి.

బృందాలలో సభ్యుల నియామకం ఇలా..

జిల్లాలో 600 ప్రాథమిక పాఠశాలల తనిఖీకి ఆరు బృందాలు, 76 ప్రాథమికోన్నత పాఠశాలలకు ఒక బృందం, 180 ఉన్నత పాఠశాలల తనిఖీకి నాలుగు టీములను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేయడానికి జిల్లా స్థాయిలో ముగ్గురితో ఒక బృందం ఏర్పాటు చేస్తారు. ఇందులో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. మరో ఇద్దరు సీనియర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఉంటారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలల తనిఖీకి ముగ్గురితో బృందాన్ని నియమిస్తారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ నోడల్ అధికారిగా, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఒకరు, ఒక ఎస్‌జీటీ సభ్యులుగా ఉంటారు. ఉన్నత పాఠశాలల తనిఖీకి తొమ్మిది మంది సభ్యులు ఉంటారు. జీహెచ్‌ఎం నోడల్ అధికారిగా ఉంటారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించే ఏడుగురు ఉపాధ్యాయులు బృందంలో ఉంటారు. వీరితో పాటు పీడీ కూడా ఉంటారు. మొత్తం 9 మంది సభ్యులు ఉంటారు.

అర్హులను నియమిస్తాం



పాఠశాలల తనిఖీకి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం. ఈ టీమ్‌లలో సభ్యులను అర్హులను కలెక్టర్ నాయకత్వంలోని కమిటీ ఏర్పాటు చేస్తుంది. త్వరలో ఈ బృందాలు పాఠశాలలను తనిఖీ చేస్తాయి.

–అశోక్, జిల్లా విద్యాధికారి

అర్హతలు ఏమిటంటే..

తనిఖీ బృందంలో సభ్యులుగా నియమించాలంటే కొన్ని ప్రత్యేక అర్హతలు కలిగి ఉండాలి. పదేళ్ల బోధనానుభవం ఉండాలి. సంబంధిత సజెక్టులో పాఠ్యాంశ ప్రదర్శన ఇవ్వగలిగి ఉండాలి. విద్యాశాఖ నిర్వహించిన వివిధ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి ప్రాధాన్యమిస్తారు. చక్కని రాత, మౌఖిక భావవ్యక్తీకరణ నైపుణ్యాలతో పాటు కంప్యూటర్ , డిజిటల్ అక్షరాస్యతలో ప్రతిభాశాలి అయి ఉండాలి. కలెక్టర్ నాయకత్వంలోని కమిటీ ఈ తనిఖీ బృందాలను నియమించేందుకు తుది నిర్ణయం తీసుకుంటుంది. అదనపు కలెక్టర్ , డీఈఓ, మరో జిల్లా స్థాయి అధికారి ఈ కమిటీలో ఉంటారు.

గీతకార్మికుల హక్కుల సాధనకు ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

సూర్యాపేట అర్బన్ : గీతకార్మికుల హక్కుల సాధనకు ఉద్యమం చేస్తామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్గూరి గోవింద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో సూర్యాపేటలో కల్లుగీత కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మొదటిరోజు వేలాదిమంది గీత కార్మికులతో ప్రదర్శన, బహిరంగ సభ, మిగతా రెండు రోజులు ప్రతినిధుల సభ నిర్వహిస్తామని వివరించారు. గీతవృత్తిని ఆధారంగా చేసుకొని జీవనంసాగిస్తున్న కార్మికుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ప్రణాళిక రూపొందించలేదన్నారు. ప్రభుత్వాలు సహకరించి తాటి, ఈత చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని కోరారు. తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, మార్కెట్ సౌకర్యం కల్పించాలని అందుకు తగిన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. గీతకార్మికులకు పింఛన్ రూ4 వేలకు, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాద నివారణకు కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలన్నారు. ప్రమాదానికి గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా రూ. 12 కోట్ల 60 లక్షలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.వెంకట నరసయ్య, గౌని వెంకన్న, బాల్నే వెంకట మల్లయ్య, కార్యదర్శి ఎస్.రమేష్ గౌడ్, సూర్యాపేట జిల్లా కార్యదర్శి మద్ది అంజిబాబు గౌడ్, కొండం కరుణాకర్, యమ గాని వెంకన్న, అబ్బగాని భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పనుల గుర్తింపునకు గ్రామ సభలు

- త్వరలో నిర్వహించేలా కార్యాచరణ
- 58 రకాల ఉపాధి పనులు చేపట్టాలని నిర్ణయం
- ఈ సారి కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ఇసుక మేటల తొలగింపు




నాగారం : జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పని కల్పించడానికి ఉద్దేశించిన గ్రామసభలు జిల్లాలో ఈ నెలలో ప్రారంభం కానున్నాయి. వాస్తవానికి అక్టోబరు 2వ తేదీ నుంచే వీటిని చేపట్టాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి దృష్ట్యా కొత్త పనులను గుర్తించలేదు. ప్రస్తుతం కోడ్ తొలగిపోవడంతో జిల్లాలో ఈ నెలలో గ్రామసభల ద్వారా 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులు గుర్తించనున్నారు.

గ్రామ పంచాయతీలు	486
మండలాలు	23
నమోదైన కూలీల సంఖ్య	1.34 లక్షలు
జాబ్ కార్డులు	2.63లక్షలు

58 రకాల పనులు

నిబంధనల ప్రకారం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి అందరి ఆమోదంతో పనులను గుర్తించాలి. జిల్లా వ్యాప్తంగా 486 గ్రామ పంచాయతీలు ఉండగా అన్నింటా గ్రామసభలు నిర్వహించడానికి ఇది వరకే ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ మేరకు 58 రకాల పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందిస్తున్నారు. వీలైనంత త్వరగా గ్రామసభలు పూర్తిచేసి మండల పరిషత్‌కు, ఆ తర్వాత జిల్లాకు పంపించి అనుమతులు తీసుకోవాలని అధికారులు తలపోస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ ఏడాదికి సంబంధించిన పనులు కొనసాగుతాయి. ఆ తర్వాత ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్తగా గుర్తించిన పనులు ప్రారంభిస్తారు.

ప్రణాళిక రూపొందించాం



గ్రామసభల ద్వారా 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులు గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందించాం. పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి అందరి ఆమోదంతో పనులను గుర్తిస్తారు. –వి.వి అప్పారావు, డీఆర్డీఓ

సీజన్లకు అనుగుణంగా..

గ్రామసభల్లో సీజన్లకు అనుగుణంగా ఉపాధి పనులు గుర్తిస్తారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఈ ఏడాది కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో కూలీల సహాయాన్ని తీసుకోనున్నారు. అలాగే పంట పొలాల్లో కూలీలతో ఇసుక మేటలు తొలగించనున్నారు. వ్యవసాయ పనులు మెండుగా ఉండే రోజుల్లో కూలీలు తక్కువ సంఖ్యలో హాజరవుతుంటారు. ఆ పనులు లేని సమయంలో అధిక మందికి పనులు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తుంటారు. జిల్లాలో కొన్నాళ్లుగా ఎక్కువగా భూగర్భజలాల పెంపునకు సంబంధించిన పనులకే ప్రాధాన్యమిస్తున్నారు. చెరువులు, కాలువలు, కుంటల్లో పూడికతీత, కాలువల్లో పిచ్చిమొక్కలు, పొదల తొలగింపు, నీటి కుంటల నిర్మాణం, కందకాల తవ్వకం, అంతర్గత మట్టి రోడ్ల నిర్మాణం, మొక్కలు, పండ్ల తోటల పెంపకం వంటి పనులు ఎక్కువగా చేస్తున్నారు.

క్లుప్తంగా

బెంచ్ దిగివచ్చి.. గోడు విని..


కోర్టు ఆవరణలో ఆటోలో రామనర్సమ్మ నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటున్న జడ్జి ఆరీఫ్

నకిరేకల్: ఓ కేసులో నిందితురాలుగా ఉన్న 80 ఏళ్ల వృద్ధురాలు కోర్టు మెట్లు ఎక్కలేని స్థితిలో ఉండగా.. జడ్జి స్వయంగా ఆమె వద్దకు వచ్చి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన యాతాకుల రామనర్సమ్మ (80) ఓ కేసులో నిందితురాలిగా ఉంది. కేసు సోమవారం నకిరేకల్ జూనియర్ సివిల్ కోర్టులో బెంచ్‌పైకి వచ్చింది. నడవలేని స్థితిలో ఉన్న రామనర్సమ్మ.. కోర్టుకు ఆటోలో వచ్చింది. కానీ కోర్టులోకి వెళ్లలేకపోయింది. దీంతో జడ్జి షేక్ ఆరీఫ్.. ఆటోలో ఉన్న రామనర్సమ్మ దగ్గరుకు వచ్చి ఎగ్జామినేషన్ చేశారు. ఆమె చెప్పిన సమాధానాన్ని రికార్డు చేశారు.

ఎఫ్‌సీఐ బీకేఎన్‌కే ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

నల్లగొండ: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఉద్యోగుల అనుబంధ సంఘమైన భారతీయ ఖాద్య నిగమ్ కర్మచారి (బీకేఎన్‌కే) సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఆ యూనియన్ తెలంగాణ ప్రాంత సీనియర్ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, సీనియర్ అదనపు కార్యదర్శి రాహుల్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండలోని ఎఫ్‌సీఐ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపయ్య, కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి, మరికొందరు సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. సంస్థలోని ఉద్యోగుల సంక్షేమానికి యూనియన్ జాతీయ, ప్రాంతీయ స్థాయిల్లో అనేక పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, అరుణ్, దివ్య, రూప, కిరణ్, మధు, అజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గింది. సోమవారం 68,090 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుండగా.. అంతే మొత్తంలో నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 16,158 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,008 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీ, కుడి, ఎడమ కాల్వలకు 18,924 క్యూసెక్కులు మొత్తం 68,090 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590అడుగులు(312.0450 టీఎంసీలు)కాగా ప్రస్తుతం 589.80అడుగులు(311.4474 టీఎంసీలు)గా నీటి మట్టం ఉంది.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

- ఒక గేటు ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. సోమవారం ప్రాజెక్టులోకి 1,711 క్యూసెక్కుల వరద వస్తుండగా.. ప్రాజెక్టు అధికారులు ఒక క్రస్టు గేటును పైకెత్తి 1,321 క్యూసెక్కుల నీటిని దిగువ వదులుతున్నారు. ప్రాజెక్టు గరిష్ట స్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుతం 644.50 అడుగుల మేర నీటి మట్టం ఉంది. కుడి, ఎడమ కాల్వలకు 341 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సీపేజీ, లీకేజీ, ఆవిరి రూపలో 50 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతోంది. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.30 టీఎంసీల నీరు నిల్వ ఉందని మూసీ ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఒక రాజకీయ శకం ముగిసింది

- కాంగ్రెస్ జెండా నిలబడిందంటే రాంరెడ్డి దామోదర్‌రెడ్డితోనే
- స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేస్తాం
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


రాంరెడ్డి దామోదర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతితో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక రాజకీయ శకం ముగిసిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత బస్సు, ధాన్యం కొనుగోళ్లు.. ఇలా అన్నింట్లోనూ ముందుందని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలంగా నిలబెడతామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరును ముఖ్యమంత్రి ఖరారు చేశారని, రెండు రోజుల్లో జీఓ వస్తుందని తెలిపారు. ఎస్సారెస్పీ నీళ్ల కోసం రాంరెడ్డి దామోదర్‌రెడ్డి రక్త దర్పణం చేశారని, దాంతోనే ఆ నీళ్లు ఈ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు వస్తున్నాయని పేర్కొన్నారు. సూర్యాపేటకు ఆరు లేన్ల రోడ్డును, రైల్వే స్టేషన్‌ను తీసుకొస్తామని తెలిపారు. అదేవిధంగా హుజూర్‌నగర్‌లో ఈ నెల 25న పెద్దఎత్తున నిరుద్యోగులకు జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పోతు భాస్కర్, పీసీసీ జనరల్ సెక్రటరీ చకిలం రాజేశ్వరరావు, ఓబీసీ నాయకుడు తండు శ్రీనివాస్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మార్కెట్ చైర్మన్లు అరుణ్ కుమార్, నరేష్ సుమతి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనురాధ, పట్టణ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలి, మండల పార్టీ అధ్యక్షులు వీరన్న నాయక్, తూముల సురేష్ రావు, కోతి గోపాల్‌రెడ్డి, కందాల వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేములపల్లి వాసుదేవరావు, దండి రమేష్, జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షుడు కక్కిరెని శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అభినయ్, కోదాడ, హుజూర్‌నగర్ మండల, బ్లాక్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యం


జాబ్ మేళాపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ నెల 25న హుజూర్‌నగర్‌లో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో హుజూర్‌నగర్‌లోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. సింగరేణి కంపెనీ, పరిశ్రమల శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో ఐటీ, సేవా, నిర్మాణ, వాణిజ్య, ఫార్మా రంగాలకు చెందిన 150 కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 3వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. 2018 నుంచి పది, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏలో ఉత్తీర్ణులైనవారు, అలాగే 2026లో ఉత్తీర్ణత సాధించబోయే వారు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హత ఉంటుందని తెలిపారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ) ప్రతినిధి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ మేళా పోస్టర్‌ను మంగళవారం మంత్రి చేతులమీదుగా ఆవిష్కరించి క్యూఆర్ కోడ్ ద్వారా నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అభ్యర్థులకు ముందుగానే ఏ కంపెనీకి అర్హత ఉందో తెలిపే విధంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామన్నారు. నిరుద్యోగులు 3 నుంచి 5 కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అభ్యర్థులు తమ రెజ్యూమే 5 జిరాక్స్ కాపీలను తీసుకొని జాబ్ మేళాకు రావాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఈటీ అడిషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, డీపీసీ జీఎం సీతారాంనాయక్, సింగరేణి కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, చందర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి శంకర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చెరువు కట్టపై అదుపుతప్పిన స్కూల్ బస్సు

- చెట్టును ఢీకొని ఆగిపోవడంతో తప్పిన పెను ప్రమాదం


చెట్టును ఢీకొని ఆగిపోయిన స్కూల్ బస్సు

మునగాల: చెరువు కట్ట మీదుగా వెళ్తున్న స్కూల్ బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈ ఘటన మునగాల మండలం నేలమర్రి గ్రామ శివారులో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన బస్సు సోమవారం ఉదయం అదే మండలం గుంజలూరు గ్రామంలో 15మంది విద్యార్థులను ఎక్కించుకొని మునగాల మండలం నేలమర్రి గ్రామంలో విద్యార్థులను ఎక్కించుకునేందుకు వస్తోంది. ఈ క్రమంలో నేలమర్రి గ్రామ శివారులో చెరువు కట్టపై స్కూల్ బస్సు ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. ఆ చెట్టు లేకపోతే బస్సు నేరుగా చెరువులోకి దూసుకెళ్లేది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో బస్సును పక్కకు తీశారు. బస్సులోని విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తమ గ్రామానికి వాహనాలు చెరువు కట్ట మీదుగా రావాల్సి ఉందని, కట్ట ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, కట్టను వెడల్పు చేసేలా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పద్మావతి చర్యలు తీసుకోవాలని కోరారు.

కారును వెనుక నుంచి ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- ఒకరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం జంగారెడ్డిపల్లికి గ్రామానికి చెందిన బొంత నర్సింహ, పల్లపు రాజు కారులో ఏపీలోని నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులోకి రాగానే కారును వెనక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పల్లపు రాజు గాయపడ్డారు. బొంత నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కుసుమ ఉపేందర్ రెడ్డి తెలిపారు.

గుంతలో పడిన లారీ.. డ్రైవర్‌కు గాయాలు


ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా రోడ్డు మధ్యలో తీసిన గుంతలో పడిపోయిన లారీ

పెద్దవూర: జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై పెద్దవూర మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మూడేళ్లుగా కొనసాగుతున్నాయి. వాహనాలు రాకపోకలు కొనసాగించేందుకు వీలుగా రోడ్డుకు రెండు వైపులా సర్వీస్ రోడ్డు నిర్మించి మధ్యలో పెద్ద గుంతను తీశారు. ఆదివారం రాత్రి ఓ లారీ నేరుగా వచ్చి ఈ గుంతలో పడిపోయింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సంబంధిత కాంట్రాక్టర్ గుంత సమీపంలో కేవలం చిన్నపాటి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడంతో మిర్యాలగూడ వైపు నుంచి వచ్చే వాహనదారులకు దగ్గరకు వచ్చే దాకా గుంత కనిపించడం లేదు. గతంలోనూ ద్విచక్ర వాహనాలు, లారీలు, కార్లు సైతం నేరుగా వచ్చి గుంతలో పడిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇద్దరు ద్విచక్ర వాహనదారులు సైతం మృతిచెందారు. సర్వీస్ రోడ్డు ప్రారంభమయ్యే ప్రదేశంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండ దిగువన కల్యాణకట్ట వద్ద సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కల్యాణకట్ట వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించి మృతుడి ఎడమ చేతికి బొటన వేలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. మృతుడి సుమారు 40 నుంచి 45 ఏళ్ల ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. కల్యాణకట్ట శానిటరీ సూపర్‌వైజర్ పాండురాజు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ భాస్కర్ వెల్లడించారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

భువనగిరిటౌన్ : శ్మశానవాటికలోని గదిలో ఉరేసుకుని బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భువనగిరి పట్టణంలో సోమవారం వెలుగుచూసింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని సీతానగర్‌కు చెందిన బాలిక(17) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోని ల్యాబ్‌లో పనిచేస్తోంది. ఆదివారం రాత్రి వరకు కుటుంబ సభ్యులతో కలిసి ఉన్న బాలిక.. అనంతరం వారి ఇంటి పక్కనే ఉన్న శ్మశానవాటికలోని గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

‘జూబ్లీహిల్స్’లో మంచ్యాతండా వాసి నామినేషన్


రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సపావట్ సుమన్‌నాయక్

మఠంపల్లి: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగనున్న ఉపఎన్నికలో పోటీ చేసేందుకు సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మంచ్యాతండాకు చెందిన ఓయూ జేఏసీ ఉపాధ్యక్షుడు, స్థానిక గుర్రంబోడు భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు సపావట్ సుమన్ నాయక్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర కేబినేట్‌లో లంబాడీలకు చోటు కల్పించాలని, గుర్రంబోడు భూముల్లో గిరిజనులకు పట్టాలివ్వాలని కోరారు. అదేవిధంగా లంబాడీలకు, ఆదివాసీలకు నడుమ నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి.. ప్రజాస్వామ్యం పైనే దాడి


నల్లగొండ కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

- దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మీద జరిగిన దాడి.. దేశ ప్రజాస్వామ్య విలువలపై దాడి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తీవ్రంగా ఖండించారు. జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేశారు. ఈ ధర్నాలో మంద కృష్ణమాదిగ పాల్గొని మాట్లాడుతూ.. దళితుడైన చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని అవమానించే ప్రయత్నమని అన్నారు. ఈ దాడి వెనుక ఉన్న ఆధిపత్య శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక దృక్పథం కలిగిన సీనియర్, రిటైర్డు న్యాయమూర్తులతో స్వతంత్ర విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని శక్తులు దళితుల ఎదుగుదలను చూసి ఓర్వలేక దాడులకు పాల్పడ్డాయని ఆయన ఆరోపించారు. దేశ ప్రజలంతా దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌ను కలిసి మంద కృష్ణమాదిగ వినతి పత్రం అందజేశారు. ధర్నాలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు జానకిరామయ్య, మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ నాయకుడు దైద సత్యంమాదిగ, ఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

నకిరేకల్: మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని గణపవరం గ్రామానికి చెందిన పగిళ్ల శ్రీనివాస్(34) తన అత్తగారి ఊరైన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని చీకటిగూడెం గ్రామంలో ఆదివారం బంధువుల దశ దినకర్మకు హాజరయ్యాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ అధికంగా మద్యం తాగాడు. అనంతరం విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పైకి వచ్చి కిందపడిపోయాడు. దీంతో అతడి తలకు గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులకు సహకరించకుండా రాత్రివేళ బయటకు వెళ్లి రోడ్డు వెంట ఓ కిరాణ దుకాణం ముందు కింద పడడంతో తలకు గాయమై మృతిచెందాడు. సోమవారం ఉదయం స్థానిక దుకాణాదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీయగా.. మృతుడు మునగాల మండలం గణపవరం గ్రామానికి చెందని శ్రీనివాస్‌గా గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ వెంకటేశం తెలిపారు.

పాఠశాల పైనుంచి దూకిన విద్యార్థిని

- హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక ఆత్మహత్యాయత్నం

సంస్థాన్ నారాయణపురం: హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేని ఓ విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన సోమవారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో జరిగింది. విద్యార్థిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలం జనగామ గ్రామానికి చెందిన బాలిక స్థానిక మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతోంది. దసరా పండుగకు ఇంటికి వచ్చిన విద్యార్థినిని సోమవారం మధ్యాహ్నం తర్వాత తల్లిదండ్రులు పాఠశాలలో వదిలిపెట్టి వెళ్లారు. తల్లిదండ్రులు వెళ్లిన కొంత సమయం తర్వాత సదరు విద్యార్థిని పాఠశాల భవనం మొదటి అంతస్తు నుంచి కిందకు దూకింది. వెంటనే గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, కారులో చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని కాలుకు తీవ్ర గాయమైనట్లు వైద్యులు గుర్తించారు. మెరుగైన వైద్యం విద్యార్థినిని కుంటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేకనే విద్యార్థిని పాఠశాల పైనుంచి దూకిందని కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థిని బ్యాగులో బై బై ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అంటూ రాసిన పేపర్‌ను గుర్తించినట్లు ప్రిన్సిపాల్ దీప తెలిపారు.

బుద్ధవనాన్ని సందర్శించిన సీడబ్ల్యూసీ డైరెక్టర్


బుద్ధుని పాదుకల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న సీడబ్ల్యూసీ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్

నాగార్జునసాగర్ : సెంట్రల్ వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ) డైరెక్టర్ ఆశిష్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ రోహిత్‌సింగ్ సోమవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిశీలనకై వచ్చిన వారు బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుని పాదుకల వద్ద పుష్పాంజలి ఘటించారు. మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో గల ధ్యానం చేశారు. వీరికి బుద్ధవనం అధికారులు శాసన, రవిచంద్ర బుద్ధవనానికి సంబంధించి బ్రోచర్లను అందజేశారు. సమావేశ మందిరంలో బుద్ధవనం వీడియోను వీక్షించారు. వీరి వెంట సాగర్ డ్యాం ఏఈలు కృష్ణయ్య, స్వర్ణ తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్
Services

పాస్‌పోర్ట్ పోయినది

■ పాస్ పోర్టు పోయినది.. C5429300 నెంబరు గల నా యొక్క పాస్ పోర్టు తోపుచెర్ల నుండి మాడుగులపల్లికి మా నాన్న బైక్ పై తేది 30-09-2025 మంగళవారం రోజున వెళ్లుచుండగా ఎక్కడో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కి తెలియజేయగలరు. గునరెడ్డి నికిత, తండ్రి గునరెడ్డి మాధవరెడ్డి నివాసం : గ్రామం తోపుచర్ల, మండలం : మాడుగులపల్లి, జిల్లా : నల్లగొండ సంప్రదించు ఫోన్ నెంబర్ : 97041 83820.
[SCA25009014]

బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు బీజేపీ కుట్ర


యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు

భువనగిరిటౌన్ : బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు బీజేపీ మొదటి నుంచి కుట్రలు చేస్తుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకుడు రాయబండి పాండురంగాచారి అన్నారు. సోమవారం సీపీఐ, బీసీ హక్కుల సాధన సమితి సంయుక్తంగా యాదాద్రి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరుతున్నా బీజేపీకి చీమకుట్టినట్టు లేదని అన్నారు. బీజేపీ బీసీల వ్యతిరేక పార్టీ అని బీసీలు గుర్తించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ కుట్రలను తిప్పికొట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకుంటామని స్పష్టం చేశారు. ఈ నెల 15న నిర్వహించే రాస్తారోకోలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కళ్లెం కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, ఎండీ ఇమ్రాన్, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, ఏశాల అశోక్, పల్లె శేఖర్‌రెడ్డి, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, వివిధ మండలాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఓపీ కోసం టోకెన్ సిస్టం తేవాలి


పేషెంట్‌తో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

బీబీనగర్: రోగులు గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడకుండా టోకెన్ సిస్టం తీసుకురావాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఎయిమ్స్ అధికారులకు సూచించారు. సోమవారం బీబీనగర్ ఎయిమ్స్‌ను ఆయన సందర్శించారు. ఓపీ విభాగం వద్ద క్యూలైన్లలో నిల్చున్న రోగులతో మాట్లాడగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తిరుపతిలో భక్తులకు టోకెన్లు జారీ చేస్తున్న విధంగా ఎయిమ్స్‌కు వచ్చే రోగులకు ఆ తరహా విధానం అమల్లోకి తీసుకువస్తే బాగుంటుందని దత్తాత్రేయ అన్నారు. టోకెన్ ఇవ్వడం వల్ల రోగులు ముందే వచ్చి గంటల తరబడి వేచివుండే పనిలేకుండా సమయానుకూలంగా క్యూలైన్‌కు వెళ్తారని పేర్కొన్నారు. ఎయిమ్స్‌కు ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థల ద్వారా కృషి చేస్తానన్నారు. అంతకుముందు ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతాసింగ్‌తో సమావేశమై ఎయిమ్స్‌లో జరుగుతున్న పనులు, వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. ఎయిమ్స్‌లో ఫైర్‌స్టేషన్ ఏర్పాటయ్యేలా, ఉప్పల్ నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించేలా చూడాలని వైద్యులు విన్నవించారు.

WANTED
Wanted Principal, Accountant, Handwriting, Computer, High School English, Karate Teacher & Hostel Warden (Male) Contact
Gowtham Group Of School, Nalgonda
98482 26251, 99127 53000



ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9505508382
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.